క్లుప్తంగా

అండగా ఉంటాం

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కుద్దుస్(40) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కుద్దుస్ కుటుంబానికి అండగా ఉంటామని ఆయన అన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ టీఎస్ జిల్లా అధ్యక్షుడు రామలింగారెడ్డి పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు మహేందర్‌రెడ్డి, కరుణాకర్, శ్రీనివాస్, నర్సింహా రెడ్డి పాల్గొన్నారు.

చిరువ్యాపారుల ఆందోళన



ఆలయ ప్రాంగణంలో ఆందోళన చేస్తున్న చిరు వ్యాపారులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాల్లోని ప్రసాదం కౌంటర్ సమీపంలో చిరు వ్యాపారులు ఆదివారం ఆందోళనకు దిగారు. ఇటీవల ఆలయ అధికారులు ఆలయ ప్రాంగణంలో ఆదాయ సేకరణలో భాగంగా పూజాసామగ్రి అమ్ముకునేందుకు రెండు షాపులకు టెండర్ నిర్వహించారు. దీంతో ఆ పరిసరాల్లో పసుపు, కుంకుమ ,పూజా సామగ్రి అమ్ముకునే చిరు వ్యాపారులను ఖాళీ చేయించారు. వారు తమ బతుకులు రోడ్డున పడ్డాయంటూ ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

నేడు సిద్దిపేట కోర్టులో వైద్య శిబిరం

సిద్దిపేటకమాన్: వరల్డ్ హెల్త్ డే సందర్భంగా సోమవారం సిద్దిపేట కోర్టులో మెడికల్ హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని, వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని మాత్‌పల్లి గ్రామంలో మృతి చెందిన మాడబోయిన నర్సింహులు అంత్యక్రియల కోసం మాజీ సర్పంచ్ భర్త మిట్టపల్లి రుషి రూ. 8వేల ఆర్థిక సహాయం అందజేశారు. పేద కుటుంబానికి చెందిన నర్సింహులు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడని తెలిపారు. యజమాని చనిపోవడంతో కుటుంబం రోడ్డున పడిందన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, ఉపేందర్‌గౌడ్, నరేశ్, వేణు పాల్గొన్నారు.

పబ్బతి హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని కొచ్చెరుతండాలో పబ్బతి హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి పాల్గొన్నారు. అనంతరం దేవాలయంలో వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తండావాసులు శ్రీనునాయక్, రంజిత్, రెడ్యా. తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదవాలి

పటాన్‌చెరు టౌన్: ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదివి రేపటి భావిభారత పౌరులుగా ఎదగాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన ఎక్స్ ఫ్లోరా అవార్డుల కార్యక్రమంలో మండలంలోని ముత్తంగి కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి 11 అవార్డులు సాధించారు. అవార్డులను జేడీ లక్ష్మీనారాయణ అందజేశారు. కృష్ణవేణి విద్యాసంస్థలు, మాస్టర్‌మైండ్స్, నారాయణ పాఠశాల చైర్మన్‌లు రాజు సంగాని, కల్యాన్ శ్రీనివాసరావు, ప్రొఫెసర్ విశ్వం తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

పుల్‌కల్(అందోల్): పుల్‌కల్ గ్రామానికి చెందిన ప్రవళిక (20) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆదివారం తెల్లవారు జామున ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో తండ్రి ప్రేమ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు పేర్కొన్నారు.





వర్గల్(గజ్వేల్): నాచగిరిలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు , వేడుకను తిలకిస్తున్న భక్తులు



కొమురవెల్లి మల్లికార్జున స్వామి అనుబంధ ఆలయంలో..

కల్యాణం.. కమనీయం

- వైభవంగా సీతారాముల కల్యాణం
- రామనామస్మరణతో మారుమోగిన ఆలయాలు
- తిలకించిన భక్తులు

శ్రీరామనవమిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో ఆదివారం సీతారాముల కల్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాజాభజంత్రీల మధ్య సీతారాముల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి ఎదుర్కోళ్లు నిర్వహించారు. కల్యాణంలో దంపతులు పాల్గొని ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీరామ నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. వందలాది మంది భక్తులు తరలివచ్చి కల్యాణంను తిలకించి పరవశించిపోయారు. పలు ఆలయాల వద్ద భక్తులకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



సిద్దిపేట జోన్ : జిల్లా కేంద్రంలో నిర్వహించిన కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్ రావు



మిరుదొడ్డి(దుబ్బాక): కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



జగదేవ్‌పూర్(గజ్వేల్): సీతారాముల కల్యాణంలో పాల్గొన్న మాధవానంద సరస్వతీ స్వామి



హుస్నాబాద్ : పట్టువస్త్రాలను తీసుకువస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్



సీతారాముల కల్యాణ వేడుకలను తిలకిస్తున్న భక్తులు



నంగునూరు(సిద్దిపేట): సిద్దన్నపేటలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కొండపాక(గజ్వేల్): దుద్దెడలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం





జగదేవ్‌పూర్(గజ్వేల్): చిన్నకిష్టాపూర్‌లో కల్యాణంలో పాల్గొన్న ప్రతాప్ రెడ్డి, భక్తులు, చిత్రంలో సీతారాముల వారు



చిన్నకోడూరు(సిద్దిపేట): సలెంద్రిలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



దేవక్కపల్లెలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మహిపాల్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఘనంగా బీజేపీ నాయకులు జెండాను ఆవిష్కరించారు. బెజ్జంకి మండలంలోని పలు గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు ఆదివారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి, సాన వేణు కమలాకర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, యాదయ్య, రాజు పాల్గొన్నారు.

తెలంగాణలో భవిష్యత్ బీజేపీదే..

దుబ్బాక: తెలంగాణలో బీజేపీదే అధికారమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు అంబటి బాలేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, బీఆర్ఎస్ పని అయిపోయిందన్నారు. బీజేపీనే ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సుభాష్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

జగదేవ్‌పూర్ మండలంలో...

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీజేపీ పార్టీ 46వ ఆవిర్భావ



దుబ్బాకలో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

వేడుకలను ఆదివారం మండలంలోని తిగుల్, మునిగడప, గొల్లపల్లి, జగదేవ్‌పూర్, చాట్లపల్లి, అలిరాజ్‌పేట, ధర్మారం, లింగారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో పార్టీ ఆధ్వర్యంలో జెండా పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీధర్, మండలాధ్యక్షుడు ఐలయ్య మాట్లాడుతూ... ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీగా బీజేపీ అవతరించిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, ఉపేందర్‌రెడ్డి, వెంకటేశం, సుధాకర్, శ్రీకాంత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

తప్పిన ప్రమాదం

కౌడిపల్లి(నర్సాపూర్): రోడ్డు పక్కన ఆగి ఉన్న ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో ఆటో ధ్వంసం కాగా ట్రాక్టర్ రోడ్డు కిందకు వెళ్లి ట్రాలీ బోల్తా పడింది. ఈ సంఘటన మండలంలోని రాయిలాపూర్ శివారులో ఆదివారం జరిగింది. బాధితుడు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయిలాపూర్ గ్రామానికి చెందిన చింత శ్రీను తన పొలం వద్ద ఆటోను రోడ్డు పక్కన ఆపి పొలంలో కూరగాయలు తెంపుతున్నాడు. కాగా కొత్త పేటతండాకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఆటోను ఢీకొట్టడంతో ఆటో ధ్వసమైంది. ట్రాక్టర్ రోడ్డు కిందకు దూసుకుపోగా ట్రాలీ బోల్తాపడింది. ప్రమాదంలో ఎవరికి ప్రమాదం జరగలేదు.

చికిత్స పొందుతూ యువతి మృతి

చేగుంట('తూప్రాన్): చికిత్స పొందుతూ యువతి మృతి చెందిన సంఘటన మండలంలోని బోనాల గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా భగీరథపల్లి గ్రామానికి చెందిన ఎల్లవ్వ మల్లేశం చిన్న కూతురు వరలక్ష్మి(18) శుక్రవారం పురుగుల మందు తాగింది. చికిత్స నిమిత్తం నార్సింగి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం గాంధీకి తరలిస్తుండగా ఆమెమృతి చెందింది. ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



పీర్లపల్లిలో పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రాజ్యాంగం పరిరక్షణకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని రాష్ట్ర యువజన సంఘం ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డి అన్నారు. జై బాపు, జై బీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని ధర్మారం, పీర్లపల్లి, ఇటిక్యాల గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం పరిరక్షణ కోసమే కాంగ్రెస్ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ ప్రతినిధులు మహేందర్ రెడ్డి, కరుణకర్, ఆయూబ్, మునీర్, మల్లేశం, క్రాంతి పాల్గొన్నారు.



కొండపాక(గజ్వేల్): పాదయాత్రలో భాగంగా ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుకునూరుపల్లి మండలంలో...

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రమైన కుకునూరుపల్లి గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. భారత రాజ్యాంగాన్ని మార్చే దిశగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చూస్తోందంటూ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని మాత్‌పల్లి గ్రామంలో కూడా కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు.

అసంపూర్తి రోడ్లు.. ప్రజల అవస్థలు

- మధ్యలోనే నిలిచిపోయిన నిర్మాణ పనులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పనులు పూర్తి చేయాలని వేడుకోలు

సిద్దిపేటఅర్బన్: జిల్లాలో పలు రహదారుల నిర్మాణాలను పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోవడంతో భారీ వాహనాలు వచ్చిన సమయంలో దుమ్ము లేచి రోడ్డు కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు కాసేపు పక్కన ఆగాల్సి వస్తోంది. బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన పనులు ప్రభుత్వం మారడంతో ఆగిపోయాయి. ఏడాది కాలంగా పనులు జరగకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది.

రెండేళ్లుగా పూర్తి కాని బ్రిడ్జి నిర్మాణం...

సిద్దిపేట జిల్లా కేంద్రం నుంచి చిన్నకోడూరు మీదుగా ఇల్లంతకుంట వరకు 22 కి.మీ రహదారిని నాలుగు వరుసలుగా మార్చేందుకు బీఆర్ఎస్ హయాంలో రూ.148 కోట్లు మంజూరయ్యాయి. పనులు సైతం ప్రారంభమయ్యాయి. సిద్దిపేట పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయం రోడ్డులో లోలెవల్ బ్రిడ్జి స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం అవసరం ఉండటంతో దానిని తొలగించి బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించి దాదాపు రెండేళ్లు కావస్తోంది. అయినా పనులు బేస్‌మెంట్ స్థాయిలోనే నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇల్లంతకుంట వరకు నిర్మించే రహదారిని చిన్నకోడూరు మండలం చౌడారం వరకు మాత్రమే పరిమితం చేశారు. 10 కి.మీ రోడ్డుకు రూ. 68 కోట్లు కేటాయించారు. ఆ పనులు కూడా మధ్యలోనే ఆగిపోవడంతో అసంపూర్తి రోడ్డుపై ప్రయాణం చేయడానికి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

జాతీయ రహదారి పనులు నత్తనడకన..

అసంపూర్తిగా నిలిచిపోయిన ఆర్అండ్‌బీ రోడ్లకు తోడు మెదక్-ఎల్కతుర్తి జాతీయ రహదారి పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. దీంతో జిల్లా కేంద్రం నుంచి వెళ్లే ఇల్లంతకుంట, వరంగల్, మెదక్ రోడ్డులో నిర్మాణ పనులు, అసంపూర్తి రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండ సురేఖ దృష్టి సారించి నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సిద్దిపేట-చిన్నకోడూరు రోడ్డులో రెండేళ్లుగా నిలిచిపోయిన బ్రిడ్జి పనులు



జాతీయ రహదారి నుంచి ఎల్లుపల్లి వెళ్లే రోడ్డు

తారు రోడ్డు నిర్మించి..

జిల్లా కేంద్రం నుంచి చిన్నకోడూరు మండల కేంద్రం వరకు నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో భాగంగా అక్కడక్కడ తారు రోడ్డు నిర్మించి మధ్యలో కంకరతో వదిలేశారు. ఇలా మండల కేంద్రానికి వెళ్లే దారిలో ఆరు చోట్ల కంకర పై నుంచే వాహనాల రాకపోకలు సాగుతున్నాయి.

ఇబ్బందులు తొలగించాలి



ఏడాది కాలంగా రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడంతో కంకర రోడ్డుపైనే నిత్యం రాకపోకలు సాగించాల్సి వస్తోంది. పనులు ప్రారంభించక ముందు రోడ్డు బాగుండేది. కంకర రోడ్డుపై వెళ్తే బండి త్వరగా పాడవుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని అసంపూర్తి పనులను పూర్తి చేయించి ఇబ్బందులు తొలగించాలి.

– తాటికొండ శ్రీనివాస్, లింగారెడ్డిపల్లి

త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు

గంగాపూర్-విఠలాపూర్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. చిన్నకోడూరు రోడ్డులోని బ్రిడ్జి పనులు త్వరలో ప్రారంభిస్తాం. ఇటీవలే పెండింగ్ పనులకు సంబంధించి ప్రభుత్వం అనుమతులిచ్చింది. పనులు పెండింగ్ ఉన్న ప్రాంతాల్లో త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– సర్దార్‌సింగ్, ఇన్‌చార్జి ఈఈ, ఆర్అండ్‌బీ